# కోడలు కోమలి

కొసరాజు సుజాత



వేసవి ప్రకృతిని మాడ్చి వేస్తూంది.

జన సంచారం పూర్తిగా పలచబడింది.

కాకికూత సైతం వినిపించడం కరువైంది.

సుదర్శనం చెమటలు గ్రక్కుతూ యింట్లోకి వచ్చాడు. ఎండ తాకిడికి అతవి

ముఖం పూర్తిగా మాడిపోయింది. చేతిలో వున్న ముల్లుకర్ర మూల వుంచాడు. తలకు చుట్టుకొన్న టవలుతీసి మంచంమీద పడేశాడు. ఉస్సురంటూ దానిమీద కూల బడ్డాడు. ఎండలో పొలంనుంచి నడిచి వచ్చినందుకు యిల్లంతా శూన్యంగా కను పించినట్లయింది. నుదుట చేతులు పట్టు కొని, క్షణకాలం కళ్ళుమూసుకున్నాడు.

"కోమల ...కోమల....'' క్షణం తర్వాత మెల్లగానే పిలిచాడు.

సమాధానం రాలేదు.

మరొక్క-క్షణం గడిచింది. పెరట్లో నుండి వాదులాట వినిపించసాగింది. నిశ్చ తంగా విన్నాడు. అతనికి అర్థమైంది. రోజూ వున్నదే; అత్తాకోడళ్ళ పోరాటం. చిరాగ్గా పెరట్లోకి వచ్చి నిలుచున్నాడు. భార్య కోమలి వేపచెట్టుక్రింద వేసుకున్న మంచంపై ఠీవిగా పడుకుని తీక్షణంగా సుశీలమ్మను చూస్తుంది.

సుశీలమ్మ అటువైపు తిరిగివున్నందున ఆమె ముఖంలోని భావాలు తెలియటం లేదు.

---

పేరు కోమలి అయినంత మాత్రాన మనసు కోమలంగా వుంటుందని నమ్మకమేమిటి ?

ఇలాటి మహా తల్లులు తెలుగునాట ఎంతమంది వున్నారో!

---

''కోమల ..." ఈ సారి కొంచెం బిగ్గరగా పిలిచాడు.

సమాధానంగా ''ఎంత సేపయిందిరా వచ్చి....'' తల్లి సుశీలమ్మ స్వరం విని పించింది.

"ఇప్పుడేనమ్మా .... అ దేదీ....'' కొంచం చిరాగ్గా అన్నాడు.

సుశీలమ్మ జవాబివ్వలేదు. మౌనంగా పెరట్లోకి నడిచింది.

సుదర్శనం మరోమారు చుట్టూ కలయ జూచి నీరసంగా తిరిగీ కళ్ళు మూసుకున్నాడు.

"ఇదుగో మర్యాదగా చెబుతున్నాను. ఇంకోమారు యిలావచ్చి అడిగావంటే తన్ని వూరుకుంటాను. జాగ్రత్త!'' మంచానికి మరింత అతుక్కు-పోతూ నిర్ల క్ష్యంగా అంది.

''అదేమిటే నే నేమన్నానని తంతా నంటున్నావు? అబ్బాయొచ్చాడు అన్నం పెట్టమన్నానంతేగా....''సుశీలమ్మ స్వరం పూర్తిగా బొంగురుపోయింది.

''నువ్వేం చెస్తున్నావంటున్నానుగా ....'' కోమల మాటల్లో అత్తగా రన్న మర్యాదే ధ్వనించటం లేదు.

"ఏరికోరి చేసుకొన్నాము. ఎందుకే మమ్మల్నందరినీ యిలా బాధ పెడుతున్నావు? ఆ వెధవ పుస్తకాలు కాకపోతే మంచివి దొరకవేమిటే...."

సుశీలమ్మ మాటలు పూర్తి కాకముందే "ఏయ్? మర్యాదగా చెబుతున్నాను. ఏయ్ గీయ్ అన్నావంటే నరుకుతా జాగ్రత్త? నన్ను కొనేసినట్లుగా జబర్దస్తీ చేస్తున్నావు. నేనే మీ అబ్బాయిని డబ్బుపోసి కొన్నాను. ఇంకోమారు ఈ పుస్తకాల విషయం ఎత్తావా నిన్ను ప్రాణాలతో వదలిపెట్టను." కోమలి బిగ్గరగా అరిచింది.

"అంతా వాడికర్మ...." వెనుదిరగబోయిందామె. "వాడి కర్మకాదు. నాకర్మ ...." అంటూనే చేతిలో వున్న పుస్తకాన్ని సుశీలమ్మ ముఖంమీద విసిరి కొట్టింది. పవిత్రతను చాటిచెప్పే ఆమె నుదుటిపై కుంకాన్ని విసురుగా చెదరగొడుతూ, క్రింద పడిపోయింది పుస్తకం. ఒక పేజీలోని పూర్తినగ్నచిత్రం ఆమెను చూపి వెకిలిగా నవ్వింది. ఆమెకళ్ళనుంచి నీరు బొటబొట కారింది. అవమానానికి కృంగిపోయింది. అంతటిస్థితిలో కూడా సుదర్శనం ఉద్రేకంగా రావటం గ్రహించింది.

"బాబూ .... ఆగరా .. అదేదో తెలియనితనంతో చేసిందది నువ్వు దానిమీద చెయ్యిచేసుకోకురా. .." అంటూ కొడుకు చేతిని గట్టిగా పట్టుకుంది.

"నువ్వూరుకోవమ్మా.... యిది మరీ రెచ్చిపోతుంది. మంచీ మర్యాద లేకుండా...." తల్లిచెయ్యి విడిలించుకొని విసురుగా కోమలిదగ్గరకు వెళ్ళాడు. వెళ్ళీవెళ్ళడం తోనే మంచంమీదున్న కోమలిజుత్తు పట్టుకొని, విసురుగా క్రిందికి లాగాడు. కాలితో విసురుగా తన్నాడు, మూలుగుతూ దూరంగావెళ్ళి పడింది. సుశీలమ్మ చూడలేక గుండెలు బాదుకుంది." దాన్ని కొట్టకురా బాబు....చిన్నతనంరా...."అంటూ.

"ముందునువ్విక్కడనుంచివెళ్ళు...." తల్లిని కసిరాడు సుదర్శనం.

సుశీలమ్మ ఏడుస్తూ వెళ్ళిపోయింది.

"ఏంటే కూశావ్...."అంటూ క్రింద పడివున్న కోమలిని జుత్తుపట్టుకొని బలవంతంగా లేపదీశాడు సుదర్శనం.

కోమల ఈసారి బెదిరిపోయింది.అతని చేతుల్లోంచి వదిలించుకొనిపారిపోయేందుకు గింజుకుంది. సుదర్శనం వదలలేదు. కోపంతో రెచ్చిపోయాడు. విసురుగా చెయ్యెత్తాడు.

"పిన్ని .... నన్ను చంపేస్తున్నాడు, పిన్నీ...." గావుకేకలు పెట్టింది కోమలి.

అప్పటికే కోమలి చెంపలు ఛెళ్ళుమన్నాయి. మళ్ళీ విసురుగా నేలకు తాకింది.

"అమ్మో....నన్ను చంపేస్తున్నాడు,

పిచ్చి....'' ఈసారి మరింత బిగ్గరగా అరిచింది.

"ఎవరే ఆ పిచ్చి. మా కొంపముంచింది, రావే....'' అంటూ మరలా కోమలిని సమీపించబోయాడు సుదర్శనం.

ఎవరో పరుగెత్తుతూ వచ్చి అతని చెయ్యిపట్టుకున్నారు. విదిలించుకో బోతూ వెను తిరిగి చూశాడు సుదర్శనం—కోమలి పిన్ని దుర్గమ్మ. ఆమెను చూడగానే మరింత రెచ్చి పోయాడు సుదర్శనం.

"నీ మాటలు విని కొంపను నాశనం చేసుకున్నాము. పెద్దవాళ్ళంటే ఆ వెధవకి ఏమైనా మర్యాదుందా? అమ్మను పట్టుకొని నోటికి వచ్చినట్లల్లా తిడుతుందా? ఒక్క క్షణంకూడా ఇక్కడ వుండేందుకువీల్లేదు. మర్యాదగా వాళ్ళింటికి తీసుకెళ్ళి దిగబెడుతావా? నన్నేతన్ని తగలెయ్యమంటావా?'' దుర్గమ్మను నిలదీసి అడిగాడు సుదర్శనం.

"నువ్వూరుకో బాబూ...దీని పొగరు మొత్తనం రోజూ చూస్తూనేవున్నాను. పెద్ద వాళ్ళంటే మరీ మర్యాద లేకుండా పోతుంది. అక్క కూతురుగదా, బాగుపడుతుందీ ప్రక్కన వుంటుందని ఈ పెళ్ళి చేస్తే యిది బరితెగించి పోయిందేమిటీ?'' దుర్గమ్మ కూడా కోపంగా అరిచింది.

ఆమె మాటలకు కోమలి దిగ్గున చూచింది. ఆమె కళ్ళల్లో క్రోధం కొట్టొచ్చినటు స్పష్టంగా కనిపించింది. సుదర్శనం చూడకుండా దుర్గమ్మ కను సైగచేసింది. వెంటనే అమాయకురాలిలా తలదించేసుకుంది కోమలి.

"బాబూ....యివి చేతులుకావు. బయట పడితే మనందరి పరువూ పోతుంది. నేను నచ్చచెబుతాగా.... నువ్వెళ్లు బాబు .'' నమ్రతగా బతిమలాడింది దుర్గమ్మ:

''ఇలాచెప్పే ఇన్నిరోజులు మమ్మల్ని మభ్యపెట్టావు. సంసారం చేసుకొనే దానికి ఆ పుస్తకాలెందుకు? పైగానన్ను తీసుకు రమ్మంటుంది. ఎంత ధైర్యం దీనికి....'' కళ్ళురిమాడు సుదర్శనం.

దుర్గమ్మ తెలివిగా ప్రవర్తించింది. వడివడిగా వెళ్ళి క్రిందపడివున్న పుస్తకాన్ని అందుకుంది. ఉద్రేకంగా ముక్కలు చేసింది. చీదరించుకుంటూ విసిరింది. చిరిగిన ముక్కలు అప్రాంతాన్నంతా పరుచుకున్నాయి. కోమలి ఈ సారి మరింత అమాయకురాలి వుండి పోయింది.

"ఛీ . నీ బతుకు తగలెయ్య.'' తుప్పునవూసి వెళ్ళిపోయాడు సుదర్శనం.

వీధిగుమ్మానికి చేరగిలబడి కన్నీళ్లు తుడుచుకుంటూంది సుశీలమ్మ. ఆమెను చూడగానే విసవిస వెళ్ళి పోతున్న సుదర్శనం ఠక్కున ఆగాడు,

"దాన్నే చేసుకోవాలని నా ప్రాణం తీశావుగా అనుభవించు.'' కసురుకున్నాడు.

''చిన్న పిల్లారా....పిల్లలు పుడితే అదే మారిపోతుంది.'' "దాని మీద చెయ్యి చేసుకోకురా ..ఆడదాన్ని కొట్టాడు అని పేరు పడుతావు. కళ్ళతో భయం పెట్టాలి గాని, మరీ అంత చావు దెబ్బలటరా కొట్టేది ." దీనంగా అంది సుశీలమ్మ.

''ఇలా అనే దానిని భయంలేకుండా చేశావు. దీనికంతాకారణం నువ్వే అను భవించు '' అంటూనే అశాంతిలో వెళ్ళిపోయాడు,

రోడ్డుమీద పిచ్చివాడులా క్రమంగా కను మరుగై పోతున్న కొడుకుని చూచి కుమిలిపోయింది సుశీలమ్మ పెళ్ళయినప్పటి నుంచి అతనికి మనశ్శాంతే లేదు. రోజూ గొడవలే, అంతా వాడికర్మ. మనసులోనే వాపోయిందామె.

"సుశీలక్కయ్యా ..'' దీనంగా విని పించింది దుర్గమ్మ స్వరం వెనుకనుంచి.

సుశీలమ్మ వెనుదిరిగింది. దుర్గమ్మ మెల్లగా దగ్గర కొచ్చింది,

"దాని వయసు అలాంటిది. ఏదో తెలి యక చేసింది.యిప్పుడు బాధపడుతూంది, చిన్నతనం. క్షమించక్కయ్యా. ఇం కెప్పుడూ ఎవరికీ ఎదురుచెప్పదట బాధ పెట్టదట.'' శాంత స్వరంతో పలికింది, దుర్గమ్మ.

''కోమలిని నేను ఎప్పుడైనా ఏమైనా అనవసరంగా మాట్లాడానా? అదేమంటే వేరుపోతామంటుంది. ఎవరైనా వింటే ఏమనుకుంటారు? అత్త రాచింపానెడు తుందనుకోరు?'' అంది.

''జరిగిందానికి అమ్మాయి బాధపడు తూంది. నువ్వొచ్చి కాస్త ఓదార్చు. నీ ముఖం చూచేందుకు సిగ్గుపడుతూంది. రా అక్కా....'' అంటూలోపలికి దారితీసింది. ఆయోమయంగా వెంట నడించింది సుశీలమ్మ.

పెరటి గుమ్మానికి అనుకొని తల వంచుకుని ఏడుస్తూంది కోమలి.


''ఇదుగో మీ అత్తయ్య వచ్చింది. ఇంకెప్పుడూ మూర్ఖంగా ప్రవర్తించినని చెప్పు." దుర్గమ్మ కోమలిని రహస్యంగా పొడించింది.

కోమలి మెల్లిగా తలెత్తింది. ఆమె కళ్ళనిండా నీరు వుండటం చూసి సుశీ లమ్మ కరిగిపోయింది,

అత్తయ్యా; ఇంకెప్పుడూ మూర్ఖంగా ప్రవర్తించను? వేరుపోయేందుకు యిం కెప్పుడూ ఆయన్ను బాధ పెట్టను.'' దుర్గమ్మ చెప్పిన మాటలు తుచ. తప్ప కుండా మాటలు నేర్పబడిన చిలుకలా అందామె.

కోడలిలో మార్పుకు సుశీలమ్మ అణు వణువూ సంతోషంతో పొంగింది. ఆనం దంతో వూగి పోయిందామె. ఓదార్చేం దుకు మాటలు రాలేదు.

''వాళ్ళిద్దరూ అన్యోన్యంగా వుంటే



"నాకు కావలసిందేముంటుందీ?" అని మాత్రం అనగలిగిందామె.

"వెళ్ళమ్మా వెళ్ళు....అబ్బాయి ఎక్కడున్నాడో వెతికి పంపుతాను. భోజనం వడ్డించి వుంచు...." అంటూ వీధి గుమ్మం వైపుకు నడిచిందిదుర్గమ్మ.

సుదర్శనం భోజనం చేయలేదని జ్ఞప్తికి రాగానే తనూ దుర్గమ్మను అనుసరించింది. వెళ్ళిపోతున్న యిద్దరినీ నిశితంగా చూస్తూ వుండిపోయింది కోమలి.

* * *

ఆ రాత్రి కోమలి ప్రవర్తనలో చాలా మార్పు కనిపించింది. సుశీలమ్మ, ఆమె భర్త, వీధి బడిలో చదువుకుంటున్న చిన్న మరిది ఆశ్చర్య పోయారు. ఎంతో నమ్రత, ప్రేమ, అణుకువ కనబరచింది అందరికీ భోజనాలు తానే వడ్డించింది.

ప్రొద్దు పోయి యింటికి వచ్చిన సుదర్శనానికి యింట్లోకి వచ్చీ రాగానే వేడినీళ్లు తోడి పెరట్లో వుంచింది వినయ విధేయతలతో భయపడుతున్న దానిలా గుమ్మానికి ఆనుకొని, స్నానానికి పిలిచింది. ఆమెలోని మార్పుకు ఆశ్చర్య పోవడమే గాక, తృప్తిగా సంతోషించాడతను.

స్నానం చేస్తున్నపుడు ఎప్పుడూ లేనిది దగ్గరే నిలుచుంది. "కొంచం త్వరగా యింటికి వస్తుండండి." మెల్లిగా సణిగింది కోమలి.

సుదర్శనం అయోమయంగా ఆమె ముఖంలోకి చూచాడు. గ్రుడ్డి వెలుతురులో మార్పుకు కారణాలు స్పష్టంగా అవగాహన చేసుకోలేక పోయాడు. వారి పెళ్ళయిన క్రొత్తలో యిలాగే వున్నట్లు జ్ఞప్తికి వచ్చిందతనికి.

సుదర్శనం మారు మాటాడకుండా స్నానం ముగించి యింట్లోకి నడిచాడు.

భోజనం ముగించి పడక గదిలోకి వచ్చిన సుదర్శనం వెనుకనే మౌనంగా వచ్చింది కోమలి. ఆమెలో మార్పు కను పించినా సుదర్శనం మాత్రం నమ్మలేకు న్నాడు. నటిస్తుందని మాత్రం ఊహించు కున్నాడు.

అతను తనను నమ్మటం లేదని గ్రహించుకుంది కోమలి. వడివడిగా వచ్చి తలగడల క్రిందనున్న అర్ధనగ్న పుస్తకా లను అందుకుంది. అతను చూచేట్లు ముక్కలు ముక్కలుగా చించి కిటికీ లోంచి విసిరింది. సుదర్శనం అటు వైపుకు తిరిగి పడుకున్నాడు

"ఏమండీ! నన్ను అర్థం చేసుకోండి. తెలియక యేదో మూర్ఖంగా ప్రవర్తించా నని నన్నెందుకండీ యిలా బాధ పెడ తారు?" దీనంగా పలికింది కోమలి.

ఆ మాటలకు సుదర్శనం మనసు కరిగిపోయింది. యిటు తిరిగి చూశాడు. దీపపు వెలుగులో ఆమె కళ్ళు నీటికుండలై నటు గ్రహించాడు. మెల్లగా దగ్గరకు తీసుకున్నాడు. బాధ దుమపిస్తూ అతని గుండెల పై వాల్చింది కోమలి.

"నీ మీద నాకెప్పుడూ కోపం లేదే. ఉమ్మడిగా వుండే ఈ కుటుంబం ఎన్నడూ విడిపోకూడదు. అన్నయ్య లందరూ దూరంగా వుండి వుద్యోగాలు చేసుకుంటు న్నారు. వారికి పొలాలమీద వచ్చేలాభాన్ని మనమేకదచే అనుభవిస్తున్నాం. వారే మైనా ఎప్పుడైనా అడిగారా? ఇంకెన్నడూ మూర్ఖంగా ప్రవర్తించకు. మనిద్దరం సఖ్యంగా వుంటే అమ్మ ఎంత ఆనందిస్తుందో ఎప్పుడైనా ఆలోచించావా? తమ్ముడు కూడా పెద్దవాడైన తరువాత వాడూ ఉద్యోగం వెతుక్కుంటూపోతాడు. విడిపోయేందుకు అప్పుడు అందరంకలసి ఆలోచించవచ్చు. అంతేకాదు. అమ్మ కంఠంలో ప్రాణం వుండగా మేమంతా విడిపోవడం జరగదు. ఆమె మనసు మేము బాధపెట్టలేము. ఇవన్నీ నువ్వెందుకు ఆలోచించవో అర్థంకావడంలేదు." మెల్లగా తల నిమురుతూ అన్నాడు।

పశ్చాత్తాపపడుతున్నట్లు వెక్కి వెక్కి ఏడుస్తూ అతని హృదయంలో చోటుచేసుకుంది కోమలి. సుదర్శనం నవ్వుతూ ఆమెను అక్కున చేర్చుకున్నాడు.

సుశీలమ్మ తెల్లవారి లేచేసరికి పాలు పితుకుతూన్న కోమలిని చూసి ఆశ్చర్యపోయింది. పెరడంతా శుభ్రంగా వుంది. సుశీలమ్మను చూసి చిన్న చిరునవ్వు విసిరింది కోమలి. ఆమె వుబ్బి తబ్బిబ్బయిపోయింది.

పితికినపాలు తీసుకొచ్చి పొయ్యి ముట్టించి దానిమీదుంచింది.

"అత్తయ్యా పాలుపొంగుతాయేమో చూస్తూవుండండి" అంటూ చీపురు పుచ్చుకొని వీధిగుమ్మంలోకి వెళ్ళింది కోమలి. ఉత్సాహంగా ఊడుస్తున్న కోడల్నిచూసి తనకళ్ళను తానే నమ్మలేకపోయింది సుశీలమ్మ. ఆమె క్షేమపూర్తిగా మారిపోయినందుకు భగవంతుడికి మనసారా నమస్కరించింది.

(ముగింపు వచ్చే సంచికలో)

# కోడలు కోమలి

కొసరాజు సుబ్బారావు



(గత సంచిక తరువాయి)

ఎప్పుడూ యింటి పనులు చేయని కోమలిని ఇరుగు పొరుగు వాళ్ళు యిప్పుడు చూసి నమ్మలేక పోయారు ఆమె కోమలి అని. కానీ ప్రతి ఒక్కరి పలుకరింపుకు కోమలి సమాధానంగా నిండైన చిరునవ్వు ఆమె పెదాలపై మెదులుతూంది.

కోమలి సంసారానికి వచ్చిన తరువాత ఇరుగు పొరుగు వాళ్ళతో కూడా నిండుగా పలుకరించటం సుశీలమ్మ యిదే మొదటి

సారిగా చూడటం మరింత ఆనందం పొందిందామె.

"అత్తయ్యా!....పాలు మాడుతున్నాయి." వీధిలో నుంచే కేక పెట్టింది కోమలి

ఆమె అరుపుకు సుశీలమ్మ తేరుకుంది. తన పరిస్థితికి నవ్వుకుంటూ వంట గది వైపుకు నడిచింది. కానీ ఆమె కంటే వేగంగా వచ్చి, పాలగిన్నెను పొయ్యిమీద నుంచి దించేసింది.

"బావి దగ్గర నుంచి రెండు చేద అందుకొని వస్తానండత్తయ్యా!" అంటూ చివ్వున లేచి రివ్వున వెళ్ళిపోయింది ఎదురు వస్తున్న సుదర్శనాన్ని చూసి ప్రక్కకు తప్పుకుంటూ కోమలి.

వంట గదిలోకి వచ్చిన కొడుకును చూసి నిండుగా నవ్వింది సుశీలమ్మ. కాఫీ కలిపిస్తూ అంది: "ఇప్పుడు నా మనసు కెంతో ప్రశాంతంగా వుంది."

తల్లి ఎంత కాలానికి సంతోషంతో మాట్లాడగలుగుతూందో వూహించుకున్నాడు సుదర్శనం. ఆ విషయాన్ని గురించి మాట్లాడదలచుకోలేదతను. కారణం రాత్రి తను వూహించుకున్నాడు పూర్తిగా మారిపోయిందని.

"మీ నాన్న వూరి నుంచి వచ్చేంత వరకూ యిలాగే మారిపోకుండా వుంటుందంటావా?"

ఇంత కాలానికి కోడలిలో మార్పు రావటం ఆమె భర్త కళ్ళారా చూడాలని ఆమె ఆకాంక్ష!

సుదర్శనం సమాధానంగా కాఫీ ముగించి నవ్వుతూ వెళ్ళిపోయాడు.

అంతలోనే 'సుశీలక్కయ్యా' అంటూ వచ్చింది దుర్గమ్మ.

సుశీలమ్మ ఆమెను చిరునవ్వుతో ఆహ్వానించింది. ఆమె సంతోషాన్ని దుర్గమ్మ చాటలేసంత కళ్ళతో గ్రహించింది. అర్థం చేసుకున్నట్లు ప్రతిగా చిరునవ్వు నవ్వింది.

"కోమలి ఏదీ?" మామూలుగా అడిగింది దుర్గమ్మ.

"బావి దగ్గరుంది. రా....కూర్చో.... కాఫీ త్రాగుతావా?" అడిగింది సుశీలమ్మ వేడి పాలు చల్లార్చుతూ.

"ఇప్పుడు కాఫీ త్రాగుతూ కూర్చుంటే ప్రయోజనం లేదు. మీ మరిది తానుకు వెళ్ళాలి. ఒక్కసారి కోమలిని చూసి వెళదామని వచ్చాను. ఇప్పుడే వస్తానుండక్కయ్యా...." అంటూ పెరట్లోకి నడిచింది దుర్గమ్మ.

ఆమె వెళుతున్న వైపు కృతజ్ఞతా పూర్వకంగా చూసింది సుశీలమ్మ. కారణం కోమలిలో యింత మార్పుకు దుర్గమ్మ మాటల తీరు అనుకుంది

రోజూ ఉదయాన గ్లాసెడు పాలు త్రాగే

అలవాటుంది సుశీలమ్మకు. పాల గిన్నె లోంచి గ్లాసులోకి వంచింది పాలను. గ్లాసు తీసుకొని వంట గదిలోంచి యివతలకు వస్తుండగా బయటి అరుగుమీద కూర్చుని చదువుకుంటూన్న చిన్నకొడుకు 'అమ్మా! నాకూ పాలు....'' అంటూ వచ్చాడు.

''ఒరేయ్ బాబూ....ఈ రోజు నుంచి ఈ యింట్లో నన్నేమీ అడగకు. అంతా మీ వదిన యిష్టమే!'' సంతోషంగా అని పూజ గదిలోకి వెళ్ళిందామె.

మనస్తత్వాలు అర్థం చేసుకోలేని వయస్సు కాబట్టి కుర్రాడిది కొంచెం అసహనంగా ముఖం చిట్లించుకున్నాడు. వదిన కోసం పెరటివైపు పోబోయాడు. అంతలోనే కోమలితో దుర్గమ్మ ఏదో గుసగుసలాడుతూ రావటం జరిగింది. కుర్రాడిని చూసి సంభాషణ ఆగిపోయింది.

కుర్రాడు గ్రహించే స్థితిలో లేడు. ''వదినా పాలు....'' అన్నాడు.

'నే వెళ్ళొస్తానమ్మా! బాబుకు ఏం కావాల్నో చూడు....'' అంటూ వెళ్ళిపోయింది దుర్గమ్మ.

[illegible]తో కోమలి వంట గదివైపుకు [illegible].

[illegible] పాలు గ్లాసు నిండుగా పోసి [illegible]. కుర్రాడు సంతోషంగా [illegible] అందుకొని [illegible] మనకు [illegible] మరలా చదువులో మునిగి పోయేంతలో కోమలి మరో గ్లాసులో పాలు నిండుగా పోసింది. గ్లాసుతో వంట గదిలోంచి యివతలకు వచ్చింది. పరిసరాలన్నీ నిర్మానుష్యంగా వున్నట్లు తోచాయి

''అత్తయ్యా!'' మెల్లిగా పిలిచింది కోమలి.

''ఇదో వస్తున్నానమ్మా....'' అంటూ పూజ గదిలోంచి వచ్చింది చేతిలో పాల గ్లాసుతో సుశీలమ్మ.

''పాలు తీసుకోండి....'' అంది కోమలి

''తాగుతున్నాను. ఇంకెందుకు నాకు? నువ్వు తాగెసెయ్....'' ఆప్యాయంగా అంది సుశీలమ్మ.


''ఇంకొంచం తీసుకోండి.'' అంటూ బలవంతంగానే ఖాళీ అవుతున్న గ్లాసుని పూర్తిగా నింపింది కోమలి.

కోడలి ఆప్యాయతకు నిండుగా నవ్వుతూ చూసింది సుశీలమ్మ. సిగ్గు నటిస్తూ వంట గదిలోకి వెళ్ళిపోయింది.

కానీ అంతలోనే ఏదో జ్ఞప్తి వచ్చిన దానిలా ''అత్తయ్యా! వీధి గుమ్మంలో ముగ్గు వేయటం మరచి పోయాను అంటూ నసిగింది కోమలి

''ఇదో వేసి వస్తాను ...'' అంటూ పాల గ్లాసు ప్రక్కనే వున్న కిటికీలో వుంచి, ముగ్గు డబ్బాతో బయటకు నడిచింది.

ఉన్నట్లుండి కోమలి గుండెలు అదు



రుతో కొట్టుకో సాగాయి. ఆమె కళ్ళు అశ్రుతతో కూడుకున్న భయంతో పరిసరాలు పరికించాయి. అంతా నిర్మానుష్యం. ఒక్క గంతులో పెరట్లోకి వడిచింది. కోళ్ళ గూడు ప్రక్కనున్న చిన్న సీసా అందుకుంది. అంతకంటే వేగంగా తిరిగి యథాస్థానానికి వచ్చింది. సుశీలమ్మ నింపాదిగా ముగ్గు పెడుతూంది. వణుకుతున్న చేతులతో సీసాలోంచి రెండు బొట్లు పాల గ్లాసులోకి వంచింది. ఒక్క క్షణం అక్కడ నిలుచోలేక పోయింది. తిన్నన కోళ్ళ గూడు దగ్గరకు వెళ్ళింది సీసాను అక్కడ దాచబోయింది. కానీ అది క్రింద పడిపోయింది. నేలపాలైన దాన్ని గూర్చి ఆలోచించటం అనవసరం. వేగంగానే వెనుదిరిగింది. గుమ్మం దగ్గరకు చేరేసరికి ఏదో శబ్దమై అటుగా చూసింది. బలమైన కోడిపుంజు గిలగిల తన్నుకుంటూంది.... ప్రాణాలు కోల్పోయేందుకు మరో కోడి ఆ ప్రాంతానికి చేరుకుంటూంది. తృప్తిగా నవ్వుకుంటూ లోనికి వచ్చేసింది కోమలి.

ముగ్గు వేయటం పూర్తి చేసి అప్పుడే లోనికి వస్తుంది సుశీలమ్మ. ఆమె చూడకుండా వంట గదిలోకి వెళ్ళింది కోమలి. తలుపు వెనుకనుంచి పరికించ సాగింది. చేతిలో వున్న ముగ్గు డబ్బాను షెల్ఫ్లో కిటికీలో వుంచి చేతులు శుభ్రంగా కడుక్కొచ్చింది సుశీలమ్మ పాలగ్లాసు దగ్గరకు.

సుశీలమ్మ పాలగ్లాసు అందుకుంది. కోమలిలో ఆతృత ఎక్కువైంది. ఆతృతతో బాటు సంతోషం కూడా మొలకెత్తుతూంది. యథాలాపంగా రెండు గుటకలు వేసింది. కోమలి తృప్తిగా నిట్టూర్చింది.

కానీ అంతలోనే సుశీలమ్మ ఏవో